

గంగాధర్

"నన్ను విడిసి ను వ్వెళ్ళగలవా ఏం, మహా –"

''లేకపోతే, గాంధీగారి గుంపులో చేరి లాఠీ దెబ్బలు తిని జైలుకి పోతా."

"అమ్మో – జైలే! మరి సూడ్డం ఎల్లాగ?"

"అప్పుడప్పుడు చూడ్డానికి రానిస్తారుట."

భాస్కరం తెగించి ఏదీ చెయ్యలేక పొయ్యాడు. కొత్తపనులు కల్పించుకుని, వాటిల్లో నిమగ్నుడై, అన్నీ మరిచిపోవడానికి కృషి చేస్తున్నాడు. ఊళ్ళో పిల్లల్ని పిలిచి, 'రాత్రిబడి' పెట్టి పాఠాలు చెప్పడం మొదలెట్టాడు. ఒక రాట్నం కొని నూలు తియ్యడం పెట్టుకున్నాడు. ఖద్దరు దుస్తులు ధరిస్తున్నాడు. కాలవ మీద వొంతెన వేయించాలని, నలుగుర్నీ కలుసుగుని, 'అర్జీలు' పెట్టిస్తున్నాడు. ఒకటి రెండు నెలలయ్యాక నాగయ్యకి జబ్బు చేసి నిమ్మళించింది.

ఏదో వనసంతర్పణ ఏర్పాటు చేశాడు. నాగయ్య వోమారు భాస్కరం వెళ్ళి, ఏదో పనుందంటూ గంటలో ఇంటి కొచ్చేశాడు. ఇంట్లో ఎవ్వరూ లేరు – గొడ్లపాక దగ్గర, నాగన్న తప్ప. మండువాగది మంచం మీద పడున్నాడు భాస్కరం. నిద్ర పట్టేసింది. ఎవరో పలకరించి లేపినట్లయింది. కళ్ళు నులుముకుంటూ లేచాడు. సీతారత్నం మంచం పక్కన బల్లమీద కాళ్ళవైపు కూర్చుని, మంచం బద్దెమీద చేతు లానించింది.

''ఏం, అప్పుడే అయిపోయిందా.''

''ఒచ్చేశా వేం.''

"పనుందిలే.''

''నిద్రేగా. నాకు తెల్సులే. నీకు కోపం మామిద."

''మీ మీ దెందుకు?''

''నాకు తెల్సు, నీకూ తెల్సు. ఊళ్లోంచి పోతానంటావుగా."

"మళ్ళా ఇప్పుడు ఆ మాటలన్నీ ఎందుకులే" అన్నాడు. కొంచెం దగ్గరగా జరిగింది. తొలిగి, దూరంగా కూర్చున్నాడు. కాసేపయ్యాక లేచి, బద్దిమీద ఆనుకుని నిలబడ్డాడు.

"కోపం పోగొట్టేదా," అంది సీతారత్నం.

"నాకు ఏకోపమూ లేదు – నువ్వు పోగొట్టనూవొద్దు."

"నేనిక్కడి కొచ్చి చాలాసేపయింది తెల్సా. నువ్వు తోటలో కనబడలేదు – ఇక్కడుంటావని – వొచ్చాను. అట్లా, రెప్పవాల్చకుండా చూస్తున్నా – నీకేసి..."

"ఎందుకో."

"నీకూ నాకూ ఊహలు చేతకావు. అదే పీకులాట," కళ్ళు చిట్లించి ప్రశ్నార్థకంగా చూస్తోంది. ఊపిరి తీసినప్పుడల్లా, వక్షం పైకి లేచి, మంచం బద్దిమీదున్న పరుపుని వొంచుతోంది. అతనికేసి జరిగింది. అతను తొలిగి అవతల వైపు కెళ్ళి నుంచున్నాడు.

"సరేలే. తెల్సిందిలే," అంటూకోపంగా మూతి ముడుచుగుని లేచి వెడుతోంది.

"దిగబెడుదువుగాని రా," అంది.

అతనూ వెనకాలె వెళ్ళాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. దొడ్లో, వొక్క పుంజు పెట్టని గదుముతోంది. అది భయపడి పరుగెడుతూ, వాళ్ళ కళ్ళమధ్యకొచ్చింది. పుంజు పక్కగా, వొంగివొంగి, రెక్కలు విదిలించి దబాయిస్తోంది. రాయి తీసి పుంజుని కొట్టాడు భాస్కరం. "రాతిగుండెస్మా" అంటూ వెళ్ళి తలుపు జేర్లవేసింది సీతారత్నం. భాస్కరం తనింటికొచ్చేశాడు. రోషం వొచ్చింది. తను మాత్రం ఎందు కిష్టపడాలి? బెట్టు చెయ్యడం తనకీ చేతనవును.

ఆరేడు నెలలతర్వాత, సీతారత్నంకి జబ్బుచేసింది. తనూ, పార్వతీ; పిల్లలూ. రోజల్లా ఆమె దగ్గరే గడిపి, కావల్సినవి కనుక్కుని, ఆదరించేవారు; ఆమెకు పొద్దు పొయ్యేది. కొన్నిరోజుల్లో కోలుకుంది.

నాలుగో నెలని స్థిరపరిచారు.

రాత్రి పదైంది. గాదికొట్ల చూరుమీద నుంచి చందమామ లేచింది. నిలబడి మన్న

